

# సభాపతికి సమానమెవరు?

—పాండ్రంకి సుబ్రమణి

**సభాపతి నాకు స్కూలుమేటు మాత్రమే కాదు, కాలేజీ మేటు కూడాను. ఆ వంక కనెక్షన్ అంతటితో ఆపేస్తే చాలదు. ఒకే ఊళ్ళో పెరిగి పెద్దయినవాళ్ళం. ఒకే ఫుట్‌బాల్ టీములో ప్లేయర్లుగా మెసలేవాళ్ళం.**

కానీ అదేం విచిత్రమో మేమెప్పుడూ క్లోజ్‌గా మూవ్ అవలేదు. అతడు నన్ను దగ్గరకు చేరనివ్వలేదనాలా, లేక చేరువవడం నా కిష్టం లేకపోయిందనాలా అన్నది ఖరారుగా చెప్పడం సులభం కాదు. క్లాసులో సభాపతి వరసన కూర్చోవడం, బయట అతడి సరసన తిరగడం ఫెలో స్టూడెంట్సుకి ప్రిస్టేజి.

సభాపతితో ఆ విధంగా ఒరుసుకు తిరిగేవాళ్ళలో మా బావ ఒకడు. పరీక్షలు ఆసన్నమవడమే తరువాయి, మూటాముల్లే సర్దుకొని సభాపతి వెంటబడేవాడు. వాళ్ళ మూవ్‌మెంటు చూస్తుంటే వాళ్ళదసలు స్నేహం అనిపించేది కాదు — గురుశిష్యుల సంబంధమూ అనిపించేది కాదు. అదేదో మాష్టరూ సర్వెంటూ రిలేషనులా ఉండేది వ్యవహారమంతాను! అలవోకగా నిల్చోవడం, ఎదుటివారితో హుందాగా మాట్లాడడం, కదలీ కదలని విధంగా పెదవుల్ని విప్పడం సభాపతికి సహజాతాలు. వచ్చిన చిక్కల్లా మోతాదుకి మించిన ఠీవి కనబర్చేవాడు. అదీ అందరి వద్దా చూపించేవాడు.

కొందరు స్టూడెంట్లు — మా బావతో సహా — ఎంత మీన్‌గా ప్రవర్తించేవాళ్ళంటే చెప్పడానికి మాటలు దొరకవు. మిత్రుడియందు అభిమానం కనబర్చడం వేరు — అతణ్ణి మఠాధిపతిని చేసి కాళ్ళూ చేతులూ ఒత్తుతూ తిరగడం వేరు. ఓ రోజున లైబ్రరీకి పెందలకడే వెళ్ళాల్సి వచ్చింది — ఓ ముఖ్యమైన బుక్కు మార్చుకోవడానికి. నేను వెళ్ళేటప్పటికి అక్కడ మా బావ మిత్రబృందం కనిపించింది. వాళ్ళ ముందు పుస్తకాలు మాత్రం చెదరి లేవు — వాళ్ళ జుత్తు మాత్రం చెదరి ఉంది. అప్రయత్నంగా తలెత్తి చూశాను — "సభాపతి కనిపించడేం చెప్మా!" అని అబ్బురపడుతూ. రౌండ్ టేబిల్ నడుమ అరమోడ్పు కళ్ళతో కూర్చుని ఉపన్యసిస్తున్నాడు. శిష్య జనం చెవులప్పగించి వింటున్నారు. నేను ఒక రౌండు తిరిగి కావల్సిన పుస్తకాన్ని వెతికి తెచ్చుకొని వాళ్ళకు కనిపించని యాంగిల్‌లో కూర్చున్నాను. బిట్ కాగితాలపై పాయింట్సు వ్రాస్తూ వివరిస్తూ సభాపతి చెప్పుకుపోతున్నాడు. వాళ్ళ గురు కులవాసం చూసిన తరవాత నా కెందుకో ఇంటికి వెళ్ళాలనిపించలేదు. దినపత్రికను తిప్పుతూ గమనించసాగాను. మరి కాసేపటికి సభాపతి చటుక్కున లేచి, "నాకు పని ఉంద్రా! రేపు కలుద్దాం. సేవ్స్ ప్లేస్, సేవ్స్ లైవ్స్" అంటూ నడచి వెళ్ళిపోయాడు. అందరూ ముక్తకంఠంతో "థేంక్యూ గురూ!" అని సభాపతికి వీడ్కోలిచ్చి నేలపైన కూర్చుని దేనినో వెతకసాగారు. ఆసక్తి ఆపుకోలేక దగ్గరకు వచ్చాను. సభాపతి వ్రాసి పారేసిన చిత్తుకాగితాలను పదిలపర్చుకుంటున్నారు. నాకు నిజంగా కంపరం కలిగింది.

ఎంతటి గురుభక్తి వీళ్ళకు!

ఒకటి రెండు సార్లు మా బావను పొడిచి చూశాను. "గురువుగారికీ, మిత్రుడికీ మధ్య బోలెడు వ్యత్యాసం ఉందిరా బావా! మీరు చూపించే ఈ అతివినయం, అతి మర్యాద స్నేహం అనే సెలయేటి మధ్య అడ్డుగోడల్ని లేపుతాయి. లిటరల్లీ స్పీకింగ్ — యూ ఆర్ స్పాయిలింగ్ హిమ్!" అది విని మా బావ కస్సుమని లేచాడు. "పిచ్చి పిచ్చి కూతలు కూయకు. సభాపతి జీనియస్ రా రామూ, జీనియస్! ఎవ్రీవన్ — ఇన్‌క్లూడింగ్ యు — షుడ్ ఒబే హిమ్. వాడు పట్టుకున్నదంతా బంగారంగా మారుతుంది. ఆలోచించిందంతా పర్వత శిఖరంగా ఎదుగుతుంది. రేపు మన మెక్కడుంటామో వాడెక్కడుంటాడో!" పాపం! సభాపతి మా బావ అంచనాను తారుమారు చేశాడు. తారుమారు చేయడం అంటే అలా ఇలా కాదు, పూర్తిగా తలక్రిందులు చేశాడు. ఎగ్జామ్స్ రోజున సభాపతి హాలులో కనిపించలేదు. మిత్ర బృందం అదరిపోయింది. లేడి గుంపులా నలు దిక్కులా పరుగెత్తారు గురువుగారి జాడ తెలుసుకునేందుకు. లైబ్రరీ, క్యాంటీను, లాబ్ అంతా వెతికారు. సభాపతి ఉనికి లేదు. కొన్ని రోజుల తరవాత మా బావ నోటమ్మట అసలు విషయం విని అప్రయత్నంగా "ప్చ్" అనేశాను నిజంగానే నొచ్చుకుంటూ. సభాపతికి తల్లిదండ్రులున్న మాట వాస్తవమైనా, పెంచి పెద్ద చేసి చదివిస్తున్నది పినతండ్రేనట. ఆయన నాగస్వర విద్యలో మహా ఘనులట. దసరా పండగలప్పుడు ఆయనొకసారి మైసూరు దర్బారు హాలులో నాగస్వరం ఆలాపించి, సెహభాష్‌లతో బాటు పలు సత్కారాలు చీనాంబరాలు పుచ్చుకొని వచ్చారట. ఆయనక్కడ "నాగస్వరశిఖామణి" అన్న బిరుదు పొంది వచ్చినప్పుడు ఊరు ఊరంతా ఎదురు వెళ్ళి ప్రత్యుత్థానం చేసి తమ ఊరి కళ్యాణ మండపానికి ఆయన పేరు పెట్టారట. పిల్లా జెల్లా లేని ఆ నాగస్వర విద్వాన్ తన విద్యాసంపత్తినంతటినీ సభాపతికి ధారబోసి శిష్యుడిగా దత్తు పుత్రుడిగా పెద్ద చేసి సభాపతిని నాగస్వర నిపుణుడిగా మలిచాడట. "మరి ఆ సంగీత విద్యను సభాపతి అంత రహస్యంగా ఉంచట మెందుకో!" మాట మధ్య విస్మయాన్ని ప్రకటించకుండా వుండలేకపోయాను. "నీకు వినే అవకాశం కలగలేదు గనుక" అని తపీమని బదులిచ్చి సంభాషణను అతికించాడు మా బావ. ఆ పినతండ్రిగారు మరణశయ్యపైన ఉన్నాడనే కబురందుకొని సభాపతి ఆఘమేఘాలపైన అంబటివలసకు పరుగెత్తాడట. ఆ వృద్ధ నాగస్వర విద్వాను కనుమూయక ముందు దత్త పుత్రుణ్ణి పక్కకు పిలిచి "ఒకటడుగుతాను చేస్తావా సభాపతీ!" అని అరమోడ్పు కళ్ళతో చూస్తూ అడిగారట. సభాపతి కన్నీరు కారుస్తూ "చెప్పండి బాబాయ్! నా బొంది నుండి ప్రాణం పోయే లోపల మీ కోరికను నెరవేర్చే తీరుతాను" అని మాటిచ్చాడట. పినతండ్రి భార్య చేతి నుండి నాగస్వరాన్ని అందుకొని, పెదవుల వద్ద అరక్షణం వుంచుకొని, "మన వంశ గౌరవాన్ని నిలబెట్టు" అని కొడుకు చేతిలో దాని నుంచి కళ్ళు మూసాడట.

సర్వ కళా వల్లభుడని బిరుదాంకితుడైన సభాపతి జీవితం అలా సంగీత సభలకూ, కళ్యాణ మండపాలకూ అంకితమైపోతుందని నేనెన్నడూ అనుకోలేదు.

* * *

మూడేళ్ళు గడిచాయి. డిగ్రీలు చేతికొచ్చిన తరవాత నేనూ, మా బావా ఉద్యోగాన్వేషణలో ఉండగానే మా పెద్దలందరూ అదేదో గ్లోబల్ స్ట్రేటజీ వంటిదేదో రచించుకొని, "ఆ ఉద్యోగ మేదో నింపాదిగా వెతుక్కోవచ్చులే!" అని మా చెల్లిని మా బావ చేతిలో ఉంచారు. అంత వేగంగా పెళ్ళి జరిపించడానికి అసలు కారణం — మా వాళ్ళకు పట్టుకున్న ఫియర్ కాంప్లెక్సు. నేడు మహానగరాలు మాత్రమే

ఒకటి, రెండు సార్లు మా బావను పొడిచి చూశాను. "గురువుగారికీ, మిత్రుడికీ మధ్య బోలెడు వ్యత్యాసం వుందిరా బావా! మీరు చూపించే అతి మర్యాద స్నేహం అనే సెలయేటి మధ్య అడ్డుగోడల్ని లేపుతుంది. లిటరల్లీ స్పీకింగ్ యువార్ స్పాయిలింగ్ హిమ్!" అది విని, మా బావ కస్సుమని లేచాడు.

కాదు, చిన్న చిన్న టౌను ప్రాంతాలు కూడా పలు విధాల ప్రలోభాలతో పేట్రేగిపోతుండడం వాళ్ళ కన్‌సర్వేటివ్ మైండ్సుని కలతపెట్టింది. నేటి యువతరం మసాలా సినిమాల వల్ల మాత్రమే కాదు, సెన్సారు కాని వీడియో ఫిల్ముల వల్ల కూడా తప్పుదారి తొక్కుతుందని గట్టిగా తీర్మానించినట్లున్నారు. పెళ్ళంటే ససేమిరా వీల్లేదని సాగదీస్తాడనుకున్న మా బావ కుందనపు బొమ్మలా పక్కన నిల్చున్న మా చెల్లిని చూసి తలదించుకున్నాడు. అప్పటికి దరిదాపుల్లో నాకు ఈడూ జోడూ గల బంధువు లమ్మాయి కనిపించకపోవడం వల్ల నా పర్సనల్ లిబర్టీ దెబ్బ తినలేదు.

కాలం కలిసి రావడమంటే యేమిటో కళ్ళారా చూశాను. పెళ్ళి జరిగిన మరుసటి వారమే మా బావ మ వెతుక్కుంటూ ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగంతోబాటు ఓ జీపు కూడా రెక్కలు కట్టుకొని వాలింది. గవర్నమెంటు క్వార్టర్సు కూడా దొరికింది.

* * *

చెల్లి గర్భిణిగా ఉందని తెలిసిరావడంతో అమ్మ ఉబ్బితబ్బిబ్బయిపోయింది. మొదట చెల్లిని పిలిపించుకు వచ్చి తొమ్మిది రోజులపాటు రకరకాల వంటకాలతో గమనించి, తప్పనిసరిగా కుంకుమ పువ్వు తినిపించి, పదవ రోజు మా బావను కూడా రప్పించి సత్యనారాయణ వ్రతం జరిపించారు. పూజా పునస్కారాలు పూర్తయిన తరవాత, తిరిగ్గా పురోహితుణ్ణి ఇంటికి పిలిపించి మంచి రోజు, మంచి ఘడియా చూసి భార్యాభర్తల్ని బయల్దేరదీసారు. సర్వీసింగుకి వెళ్ళడం వల్ల జీపు రాలేదు. బస్సు డిపో మా ఇంటి నుండి పది నిమిషాల నడక. డిపో వరకు నన్ను తోడుగా పంపించారు. అది పలు రూట్‌లకు స్టార్టింగ్ పాయింటు కావడాన, ప్రక్కనే బస్సు ట్రాన్సుపోర్టు వాళ్ళ వర్కుషాపు కూడా ఉండటాన బస్సులు ఖాళీగా దొరుకుతాయి. అదేం విడ్డూరమో మరి, ఆ రోజు బస్సులన్నీ పోరుకి వెళ్ళే మిలిటరీ వాన్‌లలా కనిపించాయి. నేను నోరు తెరచి చూస్తూ నిలుచుంటే, మా బావ కంగారుగా పరుగెత్తుకు వెళ్ళి విషయాన్ని వాకబు చేసుకొని వచ్చి చెప్పాడు — "పక్క ఊళ్ళో అమ్మవారి జాతరట. అగ్నిగుండం తొక్కుతున్నారట." మా చెల్లి రెండు చేతులూ నడుంపైన పెట్టుకొని అసహనంగా చూసింది. దడదడ వంటి దేదో గొంతు వరకూ వచ్చేసింది. మా బావ ఊరు వెంబడి వెళ్ళే బస్సులు మూడు నిల్చుని ఉన్నవి. కూర్చోవడం మాట అటుంచి సరిగా నిల్చోవడానికి కూడా చోటు లేనట్లుంది. ఊపిరి బిగపట్టుకొని మూడు బస్సుల్లోకీ దూరి దూరి వచ్చాను. తెలిసిన ముఖాల్నీ, తెలియని ముఖాల్నీ అడిగి చూశాను — మా చెల్లి పరిస్థితి వివరించి "సీట్లో నుండి లేచి నిల్చోవడానికి మాకు అభ్యంతరం లేదు. కాని ఈ జన సందోహం మమ్మల్ని నిల్చోనిస్తారా? ఊపిరి పీల్చు కోనిస్తారా? అయినా ఈ వేళప్పుడు ఇటువంటి ప్రయాణాలేమిటోయ్? మూడు రోజులు పోనిచ్చి తీసుకెళ్ళకూడదూ మీ చెల్లిని?" అని మణిపూస ల్లాంటి మాటలు. కాని మా అమ్మా, అత్తయ్యా ఒప్పుకోరు. తిరుగుముఖం పట్టడం అటుంచి, ఇంటి వాకిటి ముందు నిల్చోవడమే మహా అపచారమని నోళ్ళు బాదుకుంటారు. నా నెత్తిపైన నిప్పులు పోస్తారు. కాళ్ళూ చేతులూ ఆడక, వేవిళ్ళతో నీరసించిన మా చెల్లిని ఆ మండుటెండలో కళ్ళప్పగించి చూస్తూ నిల్చున్నప్పుడు — ఎక్కణ్ణించో మాయా గుర్రం నుండి దిగినట్లు ఊడిపడ్డాడు సభాపతి. పొడవాటి తెల్ల జుబ్బా, గ్లాస్కో పంచె కట్టుకొని భుజం పైనున్న శాలువాని అలవోకగా సరిచేసుకుంటూ, గిరజాలను సజావుగా విదిలిస్తూ — "ఒరేయ్ కృష్ణా!" అంటూ మా బావను కావలించుకున్నాడు. అప్పటి మా బావ పరిస్థితి చూడలేక ముఖం తిప్పుకున్నాను. కట్టుకున్న పెళ్ళాం పక్కనే నిల్చుందన్న ధ్యాస కూడా మరచి కన్నీరు కార్చేస్తున్నాడు. మిత్రుడి ఆప్యాయతకు కరిగి జేబు

నుండి తెల్ల రుమాలు తీసి, మిత్రుడి కళ్ళను స్వయంగా తుడిచి, పక్కనే విడ్డూరంగా చూస్తూ నిల్చున్న మా చెల్లిని చూసి, "అమ్మా చెల్లీ, ఎలాగున్నావు? పరిస్థితుల ఒత్తిడి వల్ల మీ పెళ్ళికి రాలేకపోయాను. నిజం చెప్పాలంటే మీ పెళ్ళి రోజు నేను ఊళ్ళో లేనమ్మా —. మద్రాసు మ్యూజిక్ అకాడమీ హాలులో వున్నాను" అని పరామర్శించి, ఆ పరామర్శింపులోనే తన గురించి తాను కొంత చెప్పకొని నా వేపు కనులెగరేసి చూశాడు. "ఎల్లాగున్నావయ్యా మహానుభావా! ఇంకా అంటీ అంటనట్లు అలానే ఉంటే ఎలా?" అని అడిగాడు. అదే ఠీవి — అదే హోరు! దర్పంలో ఇసుమంత ఎక్కువైన జోరు! నవ్వు రాలేదు — దూరంగా జరిగిపోవాలన్న యావ కలిగింది. చేసేది లేక నవ్వుముఖంతో ఓ చూపు విసిరి తప్పకున్నాను. ముఖం తిప్పకున్నానే గానీ, ఆలోచనల్ని తిప్పకోలేకపోయాను. అతగాడి గురించి విన్న చిన్నకారు పుకారొకటి వచ్చి జ్ఞాపకాల పొరను కదిపింది. సంగీత కచ్చేరి మంచి రక్తిలో ఉన్నప్పుడు ఈ యువ సంగీత విద్వాను ఉన్నపళాన "సభాపతికి సమాన మెవరు?" కీర్తనను ఒడుపుగా అందుకుంటాడట. అతడలా ఆలాపించడం పారవశ్యంలో మైమరచి చేసిన పనయినా, చాలా మంది సీనియరు విద్వానులకు ఆ పోకడ రుచించలేదట. తన పేరుతో ప్రారంభమయే ఆ కీర్తనను తానే అందుకొని ఆలాపించడం సభామర్యాదకు భంగకరమని వాళ్ళు చాటుమాటుగా వాపోయారట. "రాగం-తాళం" అన్న పక్ష పత్రికలో ఆ ప్రసక్తి విషయమై చదివాను. అవిశ్రాంతంగా అలవికాని ఠీవిని ప్రదర్శిస్తూ తిరిగే వాళ్ళు తమ గురించి తాము చెప్పకోవడం ఎలా మానగలరు? కొందరు నాగస్వర రసికులు ఎదురు వెళ్ళి "మీరెంతో పైకి వెళ్ళగలవారు. ఇప్పుడిలా చేయడం అవసరమేనా?" అని అడిగారట. "భక్తిపారవశ్యానికీ సంగీత రసప్రవాహానికీ మధ్య తేడా తెలియని వాణ్ణి. అందుచేత క్షంతవ్యుణ్ణి" అని సభాపతి దాటవేసాడట.

అందరమూ డిపో క్యాంటీనులో కాఫీలు పుచ్చుకోవడం పూర్తిచేసిన తరవాత మా బావ సావకాశంగా తన కెదురయిన సమస్యను మిత్రుడి ముందుంచాడు. మా బావ విన్నపం విని నా కనుబొమలెగిరి పడ్డాయి. బస్సులో సీటు దొరక్క కిటకిటలాడుతున్నది మేం మాత్రమే కాదు, చాలా మందికి ఇదే గతి. మా వరకు చెప్పాలంటే ఇది సమస్యే కాదు — సెంటిమెంటు గాని అడ్డురాకపోతే! అతలాకుతలమైపోతూన్న ఈ పరిస్థితిలో సభాపతి మాత్రం యేమి చేయగలడు? ఇతడేమైనా మాయల పకీరా బస్సులో కూర్చున్న వాళ్ళందర్నీ పిల్లుల్నీ, నల్లుల్నీ చేసిపారేయడానికి! సభాపతి శక్తిసామర్థ్యాలపైన మా బావకున్న అచంచలమైన నమ్మకానికి దిమ్మెత్తిపోయాను. మా చెల్లికి సీటింగ్ ఎరేంజ్‌మెంటు విషయమై డిపో మేనేజరుతో మాట్లాడడం — మొరపెట్టుకోవడం కూడా అయింది. అటువంటి అధికారులు చేయలేని పనిని, ట్రాన్సుపోర్టు వాళ్ళతో ఎటువంటి సంబంధమూ లేని సభాపతి, నాగస్వర విద్వాను సభాపతి ఎలా నెరవేర్చిపెట్టగలడు? చిట్టి బుర్రకు కూడా ఇట్టే తట్టిపోయే వాస్తవం కదూ ఇది! "గురువుగారు మనసుంచితే పరిష్కార మార్గం దొరక్కపోదు" మా బావ మొరపెట్టుకోవడం చూస్తుంటే కిర్రెక్కిపోతూంది. 'ఇదెక్కడి గురుభక్తిరా బాబూ! ఏకలవ్యుడుగానీ బతికి బాగుంటే ఇది చూసి సిగ్గుపడి పోడూ' అనిపించింది. చాలాసేపు మౌనవ్రతం వహించిన సభాపతి గొంతు సవరించుకోవడం గమనించి తల తిప్పాను. "మనం చదువుకునే రోజుల్లో మాటి మాటికీ ఒకటి చెప్పకునేవాళ్ళం, తర్కించుకునే వాళ్ళం. గుర్తుందా?"

> అప్పుడు నింపాదిగా సభాపతి మా చెల్లి వద్దకు వెళ్ళి, "గర్భవతివి, ఎంతసేపు అలా నిలబడగలవు? ఆ కిటికీ పక్కన కూర్చో, గాలి బాగా వస్తుంది" అన్నాడు. భార్యాభర్తలు అర్థరహితంగా చూశారు.
>
> "ముందు కూర్చోవమ్మా" అని చెల్లిని కూర్చోబెట్టి, "ఇక వస్తాను కృష్ణా" అని చకచకా దిగి, నా చేయి పట్టి లాక్కుపోయాడు. అంతా గడబిడగా తోచినా ఆ తర్వాత మబ్బు విడినట్లు అర్థమయింది!
>
> అదా సంగతి!

"చెప్ప గురూ!"

"సీరియస్ విషయాలు అంత త్వరగా మరచిపోతే ఎలా మిత్రమా!" అని నవ్వు ముఖంతో మందలించి, "అదేనయ్యా! కొన్ని మంచి పనులు చేయాలంటే, అందునా ఆ మంచి పని నిస్సహాయుల కోసం చేయాలంటే కఠినమైన నిర్ణయం తీసుకోవల్సి ఉంటుంది. అలా చేయడాన్ని లా ఆఫ్ నేచర్‌గా గుర్తించాలని వాదించేవాణ్ణి" అని జ్ఞప్తికి తెచ్చాడు.

"ఇందులో సందేహ మేమిటి గురూ!"

"మన సందేశాన్ని నిర్మాణాత్మకంగా ప్రయోగించబోతున్నాను" అని లేచి కదిలాడు సభాపతి.

ఇంకెంతసేపు ఇలా నిల్చోవాలోనన్న నా భయాన్ని పటాపంచలు చేస్తూ సభాపతి మూడు నిమిషాల్లో వచ్చేసాడు. నే నెదురు వెళ్ళి "ఏమయింది సభాపతీ?" అని అడిగాను. "వస్తానుండు" అని నన్ను విదిలించుకుంటూ బస్సు లోకి తోసుకుంటూ వెళ్ళి, "సారీ కృష్ణా! మా ఫ్రెండు ట్రాన్సుఫరయి వెళ్ళిపోయాడట, అయినా మనం అనవసరంగా వర్రీ అవడమేగానీ ఈ బస్సు ఇప్పుడు వెళ్ళదట. వచ్చేటప్పుడు ట్రబుల్ ఇచ్చిందట. మరమ్మతు చేయించిగాని కదలించరట. యూస్‌లెస్ ఫెలోస్! ఆ మాట ముందే చెప్పకూడదూ! వేస్టాఫ్ టైమ్!" అని సభాపతి కసిగా విసుక్కున్నాడు. బస్సులోని ప్యాసింజర్లు దిమ్మెత్తిపోయి చూసి "ఇది ప్పుడు ఎళ్ళదేమిటి?" అని ఆశ్చర్యంగా అడిగి లేచారు. బస్సు సిబ్బందిని నానా మాటలంటూ దిగసాగారు. "ఈ బస్సు వాళ్ళతో వచ్చిన తంటా ఇదే గురూ! శవాల్ని ఉంచినట్లు బస్సుల్ని వరసగా నిలబెట్టేస్తారు. ఏది వెళ్తుందో ఏది వెళ్ళదో ఎవ్వరికీ తెలిసి చావదు. అసలు ట్రాన్సుపోర్టేషన్ సిస్టమే డిఫెక్టివ్?" మా బావ ఆపసోపాలు పడుతూ కామెంటు చేసి, వాళ్ళ వెనుకే కదలబోయాడు — మా చెల్లిని కూడా కదిలిస్తూ. అప్పుడు వెనుక నుంచి సభాపతి మిత్రుడి భుజం పైన చేయి వేసి అదిమి "జనం మధ్య అలా తొక్కుకుంటూ వెళ్ళాలేమిటి? మా చెల్లి పరిస్థితి కూడా కొంచెం గుర్తించవోయ్" అని ఆపాడు.

కొద్దిసేపటికి బస్సు గాలిపోయిన బెలూన్‌లా మారింది. చిట్టచివర నేను ఒక్కణ్ణే క్రింద మిగిలాను. పైన ఆ ముగ్గురూ మిగిలారు. అప్పుడు నింపాదిగా సభాపతి మా చెల్లి వద్దకు వెళ్ళి "గర్భవతివి ఎంతసేపు అలా నిలబడగలవు? అదిగో ఆ కిటికీ ఓరన కూర్చో! గాలి బాగా వస్తుంది" అన్నాడు. భార్యాభర్తలు అర్థరహితంగా చూసారు. "ముందు కూర్చోవమ్మా!" అని మా చెల్లిని కూర్చోబెట్టి, "ఇక వస్తాను కృష్ణా!" అని చకచకా దిగి, నా చేయి పట్టుకొని లాక్కుపోయాడు. మొదట అంతా గజిబిజిగా తోచినా, ఆ తరవాత మబ్బు వీడినట్లు అర్థమైంది. "అదా సంగతి! ద్రోణాచార్యుడికి వినిపించేలా అశ్వత్థామ మరణ వార్త పలికిన వ్యవహారమన్న మాట!" నవ్వు ముఖంతో తిరిగి చూసేటప్పటికి సభాపతి అటుపోతూన్న ఆటో రిక్షాను అడ్డంగా ఆపి, ఒక్క ఉదుటున లోపల కెగిరి కూర్చున్నాడు. "ఉంటాను సభాపతీ!" అని చేయెత్తి వీడ్కోలు చెప్పేలోపల ఒక వాటర్ ట్యాంకర్ అడ్డంగా దూసుకుపోయింది. ఆ వాటర్ ట్యాంకర్ వెనుకే రిక్షా కూడా వెళ్ళిపోయింది. పొగమంచులా వ్యాపించిన ఆ ధూళిమేఘాల మధ్య నా కేమీ కనిపించలేదు. మనసుకి మాత్రం ఒకటి స్పష్టంగా కనిపిస్తూంది — అది సభాపతి రూపం! వాగాడంబరులపైన అబద్ధాలు చెప్పేవారిపైన నాకు ఆది నుండీ యావగింపు. నిరసన భావంతో దూరంగా జరిగిపోవాలన్న ఆలోచన విపరీతంగా కలిగేది. ఈసారి అలా జరగలేదు! "ఎందుకో మరి?" అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. కచ్చితమైన సమాధానం రాలేదు. బహుశః మానవ నైజమే అంతే మో! అనుకూలంగా జరిగినప్పుడు అంతా మారిపోతుందేమో! మనకు మేలు జరిగినప్పుడు అందుకు కారకులైన వాళ్ళను ఇష్టపడతామేమో? అవతలి వాళ్ళలో వున్న విలువల్ని కూడా 'స్వ' నుంచే చూస్తామేమో! ●